క్లుప్తంగా

పోలేరమ్మ దేవతకు ముక్కంటి సారె



పూజల్లో పాల్గొన్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మండలంలోని వెలంపాడులో వెలసిన శ్రీపోలేరమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను సమర్పించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు పట్టువస్త్రాలను స్వీకరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సర్పంచ్ రఘునాయుడు, నాయకులు అనంతరాయల్, శిరాయల్, నరసింహులురెడ్డి, మునిరాజారాయల్, శివరాయల్, రాముదెడ్డి, శివయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికడదాం



రమేష్‌బాబు, కమిషనర్

శ్రీకాళహస్తి: పట్టణ పరిధిలో నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవికాలం మొదలైందన్నారు. ముందస్తు చర్యలతో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలో 294 చేతిపంపులు, 42 పవర్ బోర్ వెల్స్, తెలుగుగంగ ద్వారా తాగునీటిని ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రానున్న మూడు నెలల్లో భూగర్భజలాలు గణనీయంగా అడుగంటే పరిస్థితులు ఉన్నాయని కలెక్టర్ సూచనల మేరకు నీటి పొదుపు చర్యలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వీధి కొళాయిల వద్ద ప్రజలు అవసరమైన మేరకే మాత్రమే నీటిని పట్టుకోవాలన్నారు. పాదచారులు, వాహనదారుల కోసం పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సేవ్ వాటర్‌సేవ్ ఫ్యూచర్ నినాదాన్ని ఆచరించాలని కోరారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే 9849907506, 9000030436,9100929867 నంబర్లను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

నారాయణవనం: వేసవిలో చోరీలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలో రాత్రి వేళల్లో అపరిచితులు తిరుగుతున్నారని, చిన్నచిన్న దొంగతనాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి ఉక్కపోతతో గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు, ఆరు బయట, డాబాలపై నిద్రిస్తారని, ఈ సమయాల్లో చోరీలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. రాత్రి సమయంలో అపరిచితులు సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆరుబయట, డాబాలపై నిద్రించే సమయాల్లో ఇంటి తలుపులకు బలమైన తాళాలు వేయాలని, ఇంటి ముందు లైట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

హిందూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లు



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగం ప్రకారం హిందూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. బుధవారం సుబ్రహ్మణ్యం ఆధర్యంలో జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ ఎంఈవో బాలయ్యను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా పెళ్లకూరు ఎంఈవో శంకరయ్యను కలిసి వినతిపత్రంఅందజేశారు.

సురేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయం



సత్కారం అందుకుంటున్న సురేంద్రరెడ్డి దంపతులు

రేణిగుంట: రేణిగుంట సీఆర్‌ఎస్ బ్రాంచ్ యూనియన్ సెక్రటరీ సురేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయమని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్ శంకర్రావు కొనియాడారు. రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం జరిగిన సురేంద్రరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లు మజ్దూర్ యూనియన్‌లో కార్మికుల పక్షాన అనేక పోరాటాలు చేసి ఉద్యమనేతగా గుర్తింపు పొందారని కితాబిచ్చారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఆయనను సన్మానించారు.

చరిత్రలో నిలిచేలా అభివృద్ధి



బియ్యపు పవిత్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి చరిత్రలో నిలిచిపోయేలా నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నియోజకవర్గంలో 30 ఏళ్ల అభివృద్ధిని చేసి చూపించారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని ముచ్చివోలు పంచాయతీలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగనన్న పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగించారని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారని పేర్కొన్నారు. కరోనా కాలంలో ప్రాణాలు సైతం పణంగా పెట్టి ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సొంత నిధులు రూ.కోట్లు వెచ్చించి ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు, సీ.విటమిన్ మందులు తదితరాలను అందించి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. తనపై ఎంతో విశ్వాసంతో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి సేవ చేశారని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను వివరించారు. నాలుగున్నర సంవత్సరాలు కనబడని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బొజ్జల సుధీర్ నేడు ఓట్ల కోసం రావడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. తమను ఇన్ని రోజులు పట్టించుకోని వారికి ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, ఎంపీపీ భానుమూర్తి యాదవ్, నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గురునాథంరెడ్డి, వయ్యాల మనోహర్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సురేష్, కూనాటి గురునాథం, అమర్‌నాథ్ రెడ్డి, రాజారెడ్డి, రెడ్డెమ్మ, ఉదయ్, వెంకట్, రామయ్య, బాబు, గంగయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న పవిత్రారెడ్డి

సంక్షేమం కోసం జగనన్నే రావాలి

నాగలాపురం: సంక్షేమ పథకాలు సమర్థవంతంగా ఇలాగే కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. కులాలు, మతాలు పార్టీలకతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. బుధవారం మండలంలోని వజ్జవారికండ్రిగా, టీపీకోట, టీపీపాలెం, కడివేడు, బీరకుప్పం, రాజుల కండ్రిగ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు, మహిళలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. నూకతోటి చైతన్య భాను మాట్లాడుతూ జగనన్న మహిళా పక్షపాతి అని, సంక్షేమ పథకాలన్నీ దాదాపు మహిళల పేర్లతోనే అందిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మహిళలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ, కార్యదర్శి జగదీష్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్, వైస్ ఎంపీపీ కుమారి, నాయకులు మహేష్ రెడ్డి, ఉదయ్ కుమార్, పళని, సుబ్రమణ్యం, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సుధీర్ క్షమాపణ చెప్పాలి

వలంటీర్లను త్రీవ్రవాదులతో పోల్చిన శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ డిమాండ్ చేశారు. టీపీ కోటలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని, ప్రభుత్వ సంకల్పానికి సేవాభావంతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే తీవ్రవాదులతో పోల్చడం నీచాతినీచమని మండిపడ్డారు. వెంటనే సుధీర్ రెడ్డి బహిరంగంగా వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు వరదయ్యపాళెంలో ప్రచారం

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు బత్తలవల్లం గిరిజనకాలనీలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వితయ్యపాళెం, కారిపాకం, పులివల్లం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం



కృష్ణాపురం ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, నాయకులు



జగనన్నకే మా మద్దతు అంటున్న మహిళలు

రేణిగుంట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'పేదల అభ్యున్నతి కోసమై ప్రతి అడుగు వేశారు... పేదరికం లేని నవ్యాంధ్ర నిర్మాణానికి మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉంది' అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కృష్ణాపురం, ఎస్టీ కాలనీ, దళితవాడ గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత యువత బైక్‌ర్యాలీ నిర్వహించింది. డప్పు వాయిద్యాలు, భారీ బాణా సంచా పేల్చి ఆమెకు గ్రామస్తులు, నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మరింతగా అభివృద్ధి చేస్తారని అన్నారు. కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు తోడుగా ఎవరున్నారో.. పక్కరాష్ట్రాల్లో ఎవరు దాక్కున్నారో ప్రజలు ఆలోచించాలని కోరారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, పేదరికం నిర్మూలనే ధ్యేయంగా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందాయని గుర్తు చేశారు. ఈ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే పేదల సంక్షేమం మరింతగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరి ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, సర్పంచ్ ముద్దురాయులు, ఎంపీటీసీ సభ్యురాలు బంగారమ్మ, పార్టీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు నగరి కృష్ణ, వెంకటేష్, కిషోర్, శివ, సాయి, గౌతమ్, గని, రాము, మహేష్, దొరబాబు, రామారావు, వెంకటరావు, దాము, కళావతమ్మ, జయమ్మ, జాన్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు హసన్, అబ్దుల్ ఖదీర్, అరుణాదేవి, బుజ్జమ్మ, మోహన్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణాపురంలో బైక్ ర్యాలీ

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు సాదర వీడ్కోలు



విమానాశ్రయంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్‌కు బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన అనంతరం ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా, అక్కడ ఆయనకు సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ రాకేష్‌కుమార్, అతుల్‌కులకర్ణి, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణ్‌రావు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జస్టిస్ భీమ్‌రావు, తిరుపతి 3వ అదనపు జడ్జి జస్టిస్ ఎం.గుర్నాథ్, ప్రోటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, ప్రోటోకాల్ ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సత్యవేడు: శిక్షణలో పొందిన అంశాలు, ఎన్నికల కమిషన్ అందజేసిన నియమావళి పుస్తకాన్ని బాగా చదివి నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. లోక్ సభ, శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను బుధవారం సాయంత్రం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు (డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ తిరుపతి)తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు దాసుకుప్పం(278, 279), మదనంబేడు పంచాయతీ (266, 267, 268)లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల్లో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓల విధులపై మాక్ పోల్, ఈవీఎం ఆపరేషన్‌పై తీసుకున్న శిక్షణపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వసతుల వివరాలు తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు విధులు, రికార్డుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూం గదిలో కిటికీలు, తలుపుల నాణ్యతను పరిశీలించారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎంఈసీ టి.అనిల్ కుమార్, డీటీ రవిచంద్ర, ఆర్‌ఐ కిరణ్‌కుమార్, వీఆర్‌ఓలు శేఖర్, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన





ఏర్పేడు : పెద్దఅంజిమేడు కేంద్రం పరిశీలన, బీఎన్‌కండ్రిగ : పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, కనమనంబేడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం నియోజక వర్గ ఎన్నికల అధికారి నరసింహులు, మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ పటాన్ మహ్మద్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల్లో వసతులు ఉన్నాయా? లేవా? అని పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది లేకుండా వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లను బుధవారం తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు పరిశీలించారు. పెద్దఅంజిమేడు, ఏర్పేడు, మన్నసముద్రం, కోబాక తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేపట్టారు. పోలింగ్ స్టేషన్ నంబర్లు, విద్యుత్, మరుగుదొడ్లు, తదితర వసతి సదుపాయాలను సంబంధిత బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలోని కడివేడు పోలింగ్ కేంద్రాన్ని బుధవారం నాగలాపురం ఎంపీడీఓ పీఎంకే బాబు పరిశీలించారు. ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

వైభవం.. కుంభాభిషేకం



గోపుర శిఖర కలశానికి అభిషేకం

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బుధవారం మహాసంప్రోక్షణం, మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ, విశేష పూజలు, అలంకరణలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారు భక్తులకు విశ్వరూప దర్శనం దర్శనమిచ్చారు. సాయంత్రం నా లుగు గంటలకు కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సమీప ప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ధర్మకర్తలు యన్నం విజయభాస్కర్, యన్నం త్యాగరాయలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



శ్రీకాళహస్తి: ర్యాలీలో ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మన ఓటు–మన హక్కు కార్యక్రమ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బాబుఅగ్రహారం నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ సాగింది. ఉద్యోగులతో పాటు నూతనంగా ఓటు నమోదు చేసుకున్న యువ ఓటర్లు పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ యువ ఓటర్లు ఓటు హక్కుపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. తహసీల్దారు జనార్దన్‌రాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

వరదయ్యపాళెం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతియుత వాతావరణలో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. బుధవారం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న పాండూరు, చిన్న ఈటిపాకం, రాళ్లకుప్పం, వానెల్లూరు గ్రామాల్లో బీఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. చిన్న పాండూరులో డీఎస్పీ మాట్లాడారు. స్వేచ్ఛయుత వాతావరణలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని భరోసా ఇచ్చేందుకే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. సీఐ భాస్కర్‌రావు, ఎస్‌ఐ శ్రీకాంత్,సిబ్బంది పాల్గొన్నారు.



వరదయ్యపాళెం: చిన్న పాండూరులో మాట్లాడుతున్న డీఎస్పీ పైడేశ్వరరావు

చదువుల టెన్షన్‌కు బైబై..



సత్యవేడు: పరీక్ష ముగిసిన అనంతరం ఆనందంలో విద్యార్థుల కేరింత

సత్యవేడు: పదో తరగతి పరీక్షలు ముగియడంతో కేంద్రాల వద్ద విద్యార్థులు బుధవారం సందడి చేశారు. స్నేహితులతో కలిసి సెల్‌ఫోన్లలో సెల్ఫీలకు దిగారు. మళ్లీ కలుద్దాం అంటూ భారమైన హృదయాలతో కదిలారు. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టి, టీవీలకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ రేయింబవళ్లు కష్టపడి చదివారు. పరీక్షలను శ్రద్ధగా రాశారు. పరీక్షలు ముగిసిన ఆనందంలో ప్యాడ్లు పైకి ఎగురవేసి కేరింతలు కొట్టారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

పిచ్చాటూరు: సోషియల్ స్టడీస్ పరీక్షతో బుధవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 ప్రభుత్వ, 4 ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 349 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 22 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ హేమమాలిని తెలిపారు, పరీక్ష కేంద్రం వద్ద ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో 144 సెక్షన్ అమలుతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.



పిచ్చాటూరు : పరీక్ష రాసేందుకు సిద్ధంగా..

కండలేరులో 8.229 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 8.229 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 10, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి యువత ఉత్సాహం

రేణిగుంట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు యువత ఉవ్విళ్లూరుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రేణిగుంట మండల అధ్యక్షుడు పీడీ దిలీప్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలో ఆయన బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా తామంతా సీఎం జగనన్న వెంటే ఉన్నామని యువకులు చెబుతున్నారని తెలిపారు. పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. తనపై నమ్మకం ఉంచి యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్ సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఫైర్ స్టేషన్‌కు రూ.2.75 లక్షల పరికరాల వితరణ

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్(ఐఎంపీఓ–ఐమాప్) ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ కార్పొరేట్ సామాజిక బాధ్యత(ఈఎస్ఆర్)లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రానికి విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన పలు పరికరాలను వితరణగా అందజేసింది. తిరుపతి జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ ఆఫీసర్ అభ్యర్థన మేరకు పవర్ రంపాలు, జనరేటర్‌తో పాటు రూ.2.75 లక్షలు రూపాయల విలువైన పలు పరికరాలను అందజేసింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో ఐమాఫ్ సీఎస్సార్ చర్యలను అభినందించారు. ఈ ప్రాంత భద్రత, సమాజ శ్రేయస్సుపై ఐమాప్ నిబద్ధతకు ఇది సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. గతంలో ఏమాప్ తన సీఎస్ఆర్ చర్యల్లో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పన, శ్రీసిటీ ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ)కి రూ. 20 లక్షలతో అంబులెన్స్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.10 లక్షలతో యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్(యూటీఎం), మూడు డిజిటల్ తరగతి గదుల ఏర్పాటుకు విరాళాలను అందజేసిందన్నారు. ఐమాప్ అసిస్టెంట్ ఎండీ హిరోకి ఇమై, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ తానెగావా, హరిహరన్, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్ కుమార్, భగవాన్, సురేంద్ర కుమార్, శ్రీసిటీ ఇన్‌చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏమాప్ సంస్థ ప్రతినిధుల నుంచి పరికరాలను స్వీకరిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య